


CHANDRA



• యద్దనపూడి సులోచనారాణి • చిత్రాలు: చంద్ర

సాయంత్రం రాత్రి ఒడిలోకి సొమ్మసిల్లినట్టుగా వాలిపోతోంది. రోడ్లమీద లైట్లు వెలిగాయి. కిన్నెర అపార్ట్‌మెంట్స్‌లో అన్ని అపార్ట్‌మెంట్స్‌లో లైట్లు వెలిగాయి. సరికొత్త రకమైన ఆర్కిటెక్చర్‌తో, ఆ అపార్ట్‌మెంట్స్ ఆ వీధికే అందం తెస్తున్నాయి. అక్కడున్నవాళ్ళంతా బాగా డబ్బు గలవాళ్ళని కింద పార్కింగ్ ప్లేస్‌లో ఉన్న ఖరీదయిన కారులే తెలియచేస్తున్నాయి.

ఆ అపార్ట్‌మెంట్స్ దగ్గరకి పాత మోడల్ ఫియట్ కారు ఒకటి వచ్చి ఆగింది. డ్రైవింగ్ సీటులో ఉన్న అతను జేబులో నుంచి కాగితం తీసి ఫ్లాట్స్ చూసి ఇదే అన్నట్టు తల పంకించాడు. కారు పక్కకి ఆపి పార్క్ చేసి దిగాడు. లాక్ చేస్తూ ఒకసారి తలెత్తి అపార్ట్‌మెంట్స్‌ని చూశాడు. మిలమిలలాడుతున్న లైట్లు దీపావళిలా మెరిసిపోతున్నాయి. చేతిలో కాగితం ఉండగా నలిపి, దానితో పని తీరినట్టు పక్కకి విసిరి పడేశాడు. అనవసరమైనది, ఉపయోగపడనిది ఏ చిన్నది కూడా అతని దగ్గర ఉండకూడదు. గేటు లోపలికి వెళ్ళబోయే ముందు, చేత్తో టై ఒకసారి సరిచేసుకుని, తల అటూ ఇటూ అలవాటయిన పనిలా అప్రయత్నంగా తిప్పాడు. అతను నడివయను మనిషి. పొట్టిగా, దృఢంగా, లావుగా ఉన్నాడు. తల బట్టతల అవుతున్నా, మంచి హెయిర్ స్టయిలిస్ట్‌తో కట్ చేయించుకోవటం వల్ల బట్టతల కప్పబడిపోయినా, గాలికి జుట్టు చెదిరినప్పుడు తోమిన చెంబులా కనిపిస్తూ మాయమవుతూ మబ్బుల మధ్య చంద్రుడిలా ఉంది. అతని శరీరంలో అతని పొట్ట ఇమడలేనట్టుగా ముందుకు వచ్చేసి, షర్ట్ కింద గుండ్రటి గుమ్మడికాయ దాచుకున్నట్టుగా దర్శనం ఇస్తోంది. అతను ఆ పొట్ట గురించి చాలా కాన్షస్‌గా ఫీలవుతాడు. ఒకసారి కళ్ళు వాల్చుకుని పొట్టని చూసుకున్నాడు.

"హుం!" ముక్కుపుటాలు పెద్దవి అయినాయి. గట్టిగా గాలి ఎగబీల్చి, పొట్టని లోపలికి లాక్కోవాలని చూశాడు. లాభం లేకపోయింది. 'అందులో ఈ రోజు పావని చేసిన స్పెషల్ భోజనం. వెధవ మనసు! ఎంత నిగ్రహించుకుందామన్నా ఆగక భోజనం వైపు అయస్కాంతంలా లాగేస్తుంది. మార్నింగ్ పరుగులు, బస్కీలు, ఊపిరాడని పని. ఏవీ ఈ పొట్టని తగ్గించడం లేదు.' మిగతా సమయాల్లో అతనికి ఈ పొట్టతో పెద్దగా ఇబ్బందేం లేదు. ఇలా ఆడవాళ్ళని వ్యవహార రీత్యా కలుసుకోవటానికి వెళ్ళాల్సి వచ్చినప్పుడే చాలా ఇబ్బందిగా, సిగ్గుగా ఉంటుంది. అతను లావుగా ఉండడం వల్ల శరీర భారం తెలియనట్టుగా, గొరిల్లాలా, ఊగుతూ నడుస్తున్నట్టు కొత్తగా స్టయిల్ అలవాటు చేసుకున్నాడు.

గేటు లోపలికి వచ్చి, లిఫ్ట్ దగ్గర నేమ్ బోర్డ్స్‌లో కావాల్సిన పేరు వెతుక్కున్నాడు. "యస్. మాళవిక 401" అని ఉంది. అతను లిఫ్ట్‌లో నాలుగో అంతస్తుకి వచ్చాడు. లిఫ్ట్‌లో నుంచి బయటికి రాగానే కుడి చేతివైపే ఉంది ఫ్లాట్ నంబరు 401. గుమ్మంపైన కేరళ కథకళి డాన్సర్ ముఖం బొమ్మ ఉంది. దాని కింద 'నమస్తే' అని ఉంది. అతను ఆ బొమ్మని, కళ్ళ చివర్లకి కొసలుగా దిద్దిన కాటుక రేఖల్ని చూస్తూ కాలింగ్ బెల్ స్విచ్ నొక్కాడు. అతని కళ్ళు బొమ్మ మీద నుంచి కాలింగ్ బెల్ పక్క నేమ్ బోర్డు మీద నిల్చాయి. 'డాక్టర్ మాళవిక' అని ఉంది. అతను పెదవులు బిగించి, కనుబొమలు ఎత్తి భుజాలు కుదించాడు. 'డాక్టర్ మాళవిక! అంటే డాన్స్‌లో పిహెచ్.డీయా లేక ఏ యూనివర్సిటీ అయినా గౌరవ డాక్టరేట్ ఇచ్చిందా? ఏమిటో! ఇదివరకు రోజుల్లో డాక్టరేట్ అంటే ఎంత కష్టం! దానికి ఎంత విలువ!'

మళ్ళా కాలింగ్ బెల్ మోగించాడు. ఇంతలో తలుపులు తెరుచుకున్నాయి. గుమ్మంలో అమ్మాయి నిల్చి ఉంది. తెల్లటి పంజాబీ డ్రెస్ ధరించింది. నడుం చుట్టూ పింక్ కలర్ ఓణీ బిగించి కట్టుకుంది. ఆమె ఆగడంతో కాళ్ళకున్న గజ్జెలు ఆగిన చిరు శబ్దం. అతను నమస్కారం చేశాడు.

"నేను విశ్వనాథ ప్రతాప శర్మని." చెబుతూనే జేబులో నుంచి కార్డు తీసి ఇచ్చాడు. ఆ అమ్మాయి కార్డు తీసుకుని చూసింది.

లోపలికి రమ్మన్నట్టు చేత్తో అలవోకగా సైగ చేసి వెనక్కు తిరిగి వెళ్ళింది. ఆమె ఆ చేతి సైగతో రమ్మనడం, బొమ్మ తిరిగినట్టు వెనక్కు తిరగడం, ఆ నడవడం అంతా డాన్సర్ లక్షణాలే!

విశ్వనాథ ప్రతాప శర్మ మరోసారి మెడలో టై సరిచేసుకుని వెళ్ళాడు. లోపల పెద్దదిగా ఉన్న యల్ షేప్ హాలు. విశాలంగా, చాలా అందంగా ఉంది.

"మిస్! మాళవికా!" అతనేదో చెప్పబోయాడు.

**ఆమె చేతి సైగతో రమ్మనడం, బొమ్మ తిరిగినట్టు వెనక్కు తిరగడం, ఆ నడవడం అంతా డాన్సర్ లక్షణాలే! అతన్ని కూర్చోమని సోఫా చూపించింది.**

ఆ అమ్మాయి అలవోకగా చేయి ఎత్తి, మునివేళ్ళతో వారించింది. అతన్ని కూర్చోమని సోఫా చూపించింది. అదంతా డాన్స్ ప్రోగ్రాంలో భాగంగా అనిపిస్తోంది అతనికి. ఆమె వెళ్ళింది. ఆమె నడకలో లయ, తాళం ఉన్నాయి. ఆమె లోపలి గుమ్మంవైపు నడిచి, "దీదీ! అతిథులు ఎవరో వచ్చారు నీ కోసం" — హిందీలో చెప్పి పక్క గదిలోకి వెళ్ళిపోయింది. లోపల సన్నగా మృదంగం మోత వినిపిస్తోంది.

విశ్వనాథ ప్రతాప శర్మ ఒక్క నిమిషం అలాగే నిలబడిపోయాడు. 'ఏమిటీ? ఈ అమ్మాయి మాళవిక కాదా!' అతనిని నిరుత్సాహం పెద్ద కెరటంలా వచ్చి ముంచేయబోతుంటే, కష్టం మీద ఉసూరుమనే భావం ముఖంలోకి రాకుండా నిగ్రహించుకుంటూ సోఫాలో కూర్చున్నాడు. పొట్టని నిశ్శబ్దంగా లోపలికి తీసుకోబోయి ఆపేశాడు. తను మామూలుగా కూర్చున్న విషయం వెన్ను మీద చరిచి చెప్పినట్టు గుర్తుకు వచ్చింది. కాలు మీద కాలేసుకుని, వెనక్కు ఆనుకుని రాజసంగా చూస్తున్నాడు.

హాలు చాలా అందంగా ఉంది. గోడలకి గ్రీన్ కలర్. సోఫాలు ముదురు పొగాకు రంగు. లేత రంగులో పరదాలు. హాలులో ఫర్నిచరు, అక్కడక్కడా ఇత్తడి హంసలు, వాటిలో ఫ్లవర్స్ గోడలకి సింపుల్‌గా మోడరన్ పెయింట్స్ మంచి షేడ్స్ గల దీపాలు. అలంకరణ అంతా ఎక్కడా ఏ చిన్న అపశ్రుతి లేనంత పర్‌ఫెక్ట్‌గా ఉంది. 'కొంతమంది ఈ విధంగా ఇళ్ళలో అందంగా బతుకుతారు. మరికొంతమంది అందమైన ఇళ్ళని రైల్వే ప్లాట్‌ఫారంలాగానో, బందెలదొడ్డిలాగానో చేసేస్తారు. ఆ చేతుల మహాత్మ్యం అలాటిది. పావనితో ఎంత మొత్తుకున్నా వంట మీద ఉన్న శ్రద్ధ ఇంటి మీద లేదు.'

అతను చుట్టూరా కలియచూశాడు. ఈ అందంలో నుంచి శాంతికిరణాలు వచ్చి తాకి అలసిన తన మనసుని సేదదీరుస్తున్నాయి. ఆ నిశ్శబ్దంలో బోలెడంత హాయి, చుట్టూరా అంత సందడి మధ్య! ఇది ప్రశాంత ద్వీపంలా ఉంది. అతనికి ఏమిటో చాలా రిలాక్సింగ్‌గా ఉంది. ఇల్లంతా కళ్ళతో కలియచూస్తున్నాడు.

"నమస్తే." కోమలంగా వినిపించింది. అతను ఉలికిపాటుగా అటు తిరిగాడు.

ఎదురుగా దంతపు బొమ్మలా, నాజూకుగా, అందంగా ఉంది. ఆమె జుట్టు భుజాల దిగువ వరకూ కట్ చేసి ఉంది. స్లీవ్‌లెస్ జాకెట్. సన్నటి బార్డర్ గల చీర. ఒంటి మీద ఆభరణాలేవీ లేవు. ఆమె నిరాడంబరతలో నుంచి ఆమె అందం దేదీప్యమానంగా వెలుగుతున్నట్టు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

అతను తెచ్చిపెట్టుకున్న రాజసం మర్చిపోయాడు. చప్పున లేచి వినయంగా నమస్కరించాడు. ఆమె అతన్ని కూర్చోమని ఆదేశిస్తున్నట్టు సైగ చేస్తూ, తను వచ్చి ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చుంది. వచ్చి రావడం, సోఫాలో వెనక్కు ఆనుకుని, కాలు మీద కాలు వేసుకుని కూర్చోవడం, భుజాల చుట్టూ పరుచుకున్న మెత్తటి సిల్కులాటి జుట్టుని ఎడం చేత్తో అలవోకగా చుట్టి, ఎడం వైపు నుంచి ముందుకు వేసుకోవడం అంతా క్షణంలో జరిగిపోయింది.

అతను కాలు మీద కాలు వేసుకుని కాదు కదా కనీసం సోఫాలో వెనక్కు ఆనుకుని కూడా కూర్చోలేకపోయాడు. ముందుకు వంగి కూర్చున్నాడు.

ఆమెలో ఏదో మేగ్నటిక్ పవర్ ఉంది. ఆమెలో యౌవనం ఉంది. ముఖంలో జీవితం చూసిన అనుభవం. అయినా నిర్మలత. నిండుతనం. కళ్ళు డాన్సర్ కళ్ళులా, ఎక్స్‌ప్రెషన్‌కి ట్రయిన్ చేయబడినట్టున్నాయి. వాటిలో కొత్తవాళ్ళని కలిసినప్పుడు మాట్లాడడంలో ముభావత.

విశ్వనాథ ప్రతాప శర్మ చూస్తున్నాడు. అతను ఆ క్షణంలో తన పొట్ట గురించి కూడా మర్చిపోయాడు. ఆమెనే చూస్తున్నాడు. అతను అలా చూడడంతో ఆమె కనుకొలకుల్లో చిరు ఆగ్రహం! కానీ, ప్రొఫెషనల్‌గా ఇలాటి నాన్సెన్స్ భరించడం అలవాటయిన, తొణుకు ఎరగని నిగ్రహం. మర్యాద చెక్కు చెదరకుండా - "హలో!" అంది చిరునవ్వుతో. ఆమె చిరునవ్వు చివర ఇలాంటివారిని వందమందిని చూసిన అనుభవం తాలూకు తిరస్కారం ఉంది.

"హలో!" అతను ఉలికిపాటుగా ఈ లోకంలోకి వచ్చాడు.

"నేను -" అన్నాడు. అతను పేరు చెప్పలేకపోతున్నాడు.

"విశ్వనాథ ప్రతాప శర్మ" అంది.

"యస్.యస్.యస్." అతను జేబులో నుంచి లెటర్ తీసి ఇచ్చాడు. ఆమె మునివేళ్ళతో అందుకుని, తెరిచి చూసి, టీపాయ్ మీద పెట్టింది.

"యస్. ఐ నో! మిస్టర్ అగర్‌వాల్ నాకు మధ్యాహ్నం ఫోన్‌లో మీ గురించి చెప్పారు. మీరు 'గర్ల్ చైల్డ్ నిధి' కోసం చేస్తున్న మీ చారిటబుల్ ప్రోగ్రామ్‌ని వారు స్పాన్సర్ చేస్తున్నారు అన్నారు. మీరు మీ ప్రోగ్రామ్ ఎప్పుడు ఫిక్స్ చేసుకున్నారు?"

"సి.యమ్ డేట్ కోసం చూస్తున్నాం."

"ఐ సీ." ఆమె ఉత్తరం తీసుకుని మళ్ళా చూసింది. ఎడమ కనుబొమ కాస్త కుదించి ఆలోచించింది.

"ఒక్క నవంబర్‌లో మాత్రం నేను ఇండియాలో ఉండను. యు.కె టూర్ ఉంది. మిగతా రోజులు ఎప్పుడైనా, జస్ట్ టూ వీక్స్ ముందు చెప్పండి చాలు."

"ఒ.కె! ఒ.కె! థాంక్ యూ! థాంక్ యూ వెరీ మచ్."

ఆనందంగా అన్నాడు. ఇద్దరి మధ్యా నిశ్శబ్దం.

ఆమె మాటలు క్లుప్తంగా, సూటిగా ఉన్నాయి. అనవసర మర్యాదలు, అలంకృతులూ లేవు. ప్రవర్తన గంభీరంగా ఉంది.

వ్యవహార సరళిలో మాటలు ఎంతవరకు పెంచాలో,

ఎక్కడ కట్ చేయాలో బాగా తెలిసిన అనుభవశాలిలా ఉంది.

ఇంకో నిమిషం నిశ్శబ్దంలోకి రాలిపోయింది.

ఆమె చేతి వేళ్ళు సోఫా చేతి మీద తాళం వేస్తున్నట్టు కదిలినాయి.

ప్రతాప శర్మ ఊహించిందే నిజమైంది. "ఒ.కె" అంటూ లేవబోతోంది.

అతనికి ఆ ఒ.కె స్వర్గంలో నుంచి భుజం పట్టి నరకంలోకి తోసినట్టుగా ఉంది.

ఆమె మాట విననట్టే చప్పున "వన్ గ్లాస్ వాటర్ ప్లీజ్" అన్నాడు. ఆమె ఆగింది. వెనక్కు ఆనుకుంది. లిప్త కాలం తమ అతిథిగా వచ్చిన అతన్ని మంచినీళ్ళయినా అడగనందుకు ఫీలయినట్టుగా, "లలితా! వాటర్" అంది. ఆ కేకలో, ఆ కంఠధ్వనిలో నర్తకి స్టేజీ మీద మునివేళ్ళ మీద నిలబడి ఎవరినో పిలిచినట్టే వినసొంపైన విన్యాసం!

లలిత నీళ్ళు తెచ్చింది. పది సంవత్సరాల పనిపిల్ల!

జుట్టు వెనక్కి దువ్వి రబ్బరుతో బిగించిన చిన్న ముడి. నల్లగా, ఆరోగ్యంగా ఉంది. ఆ అమ్మాయి శరీర ఛాయ నలుపు కూడా, ఆ గదికి అదేదో మేచింగ్‌లా ఉంది.

పనిపిల్ల లలితలో కూడా ఒక పొందిక! డిసిప్లిన్ తెచ్చిన సీరియస్‌నెస్! లలిత ట్రే అక్కడ పెట్టి వెళ్ళిపోయింది. విశ్వనాథ ప్రతాప శర్మ మంచినీళ్ళు తాగుతూ "దిసీజె బ్యూటిఫుల్ ఫ్లాట్" మనసారా మెచ్చుకుంటూ అన్నాడు.

ఆమె కళ్ళలో 'థాంక్ యూ' అనే ఎక్స్‌ప్రెషన్ యాంత్రికంగా వచ్చింది. అందులో సంతోషం లేదు. ఆ కాంప్లిమెంట్ వినీ వినీ విసుగుపుట్టిన నిర్లక్ష్యం ఉంది.

మళ్ళీ మహా గంభీరమైన నిశ్శబ్దం కోరలు గల రాక్షసుడిలా వచ్చి తనకీ ఆమెకీ మధ్య నిలబడింది. "మీరు... మీరు మీ ప్రోగ్రామ్‌కి ఎంత చార్జి చేస్తారు?" నసిగినట్టు అన్నాడు. అగర్వాల్, 'ఆవిడ దగ్గర బేరం కుదరదు. తక్కువ ప్రోగ్రామ్స్ ఇస్తుంది. ఎక్కువ చార్జి చేస్తుంది' అని ముందే వార్నింగ్ ఇచ్చేశాడు. ఆమె డాన్స్ ప్రోగ్రామ్‌కి చార్జ్ చేసే రేట్ అగర్వాల్ చెప్పగానే, విశ్వనాథ ప్రతాప శర్మ లోలోపల గుండెలు బాదుకుంటూ "అమ్మో! మీరు స్పాన్సర్ చేసే మొత్తంలో నలభై అయిదు శాతం ఆవిడకే పోతుంది" అన్నాడు.

"చెప్పాను కదయ్యా! మా ఎం.డిగారి మేనకోడలు మాళవిక స్టూడెంట్. మాళవిక ట్రూప్‌తో డాన్స్ ఉంటేనే మేం నీ ప్రోగ్రాం స్పాన్సర్ చేస్తాం."

"కానీ....."

"మిగతా దాంట్లో సర్దుకోవయ్యా. మేం స్పాన్సర్ చేసి, మాళవిక ట్రూప్ డాన్స్ అంటే నీ ప్రోగ్రాంకి పేరు బాగా వస్తుంది.

'అబ్బా! ఏం పాలిటిక్స్! నాలుగు డబ్బులు నాకు మిగులుతాయి అని నేను పాటుపడ్తుంటే మీరు మీ వాళ్ళకి మిగులుస్తున్నారా?' కసిగా అనుకున్నాడు. "ఒక్కసారి నేను ఆమెని కలిసి రిక్వెస్ట్ చేసుకుంటాను" అన్నాడు. "సరే నీ ఇష్టం" అన్నాడాయన.

విశ్వనాథ ప్రతాప శర్మకి ఈ నిమిషంలో అవన్నీ గుర్తుకు రావడం లేదు. మాళవికకి వీలయినంత ఎక్కువ డబ్బు ఆఫర్ చేసి, ఆ కళ్ళలో వెన్నెలలా మెరిసే ఆనందం చూడాలని అతని మనసు తహతహలాడుతోంది.

"అగర్వాల్ మాకు స్పాన్సర్ చేసే మొత్తంలో ఏభై శాతం మీకు ఇచ్చేస్తాను. మీకూ ఖర్చులుంటాయి కదా? నేను ఆర్ట్ లవర్‌ని." కాస్త ముందుకు వంగి, మెడ చాచి, కళ్ళు 'పెద్దవి' చేసి కనుబొమలెత్తి, చేయి ఎత్తి చెబుతూ, ఆమె కళ్ళలోకి చూస్తూ అన్నాడు.

పెద్దవి చేసిన అతని కళ్ళలోకి ఆమె నిశితంగా, రెప్పవాల్చకుండా చూసింది. ఆ నిమిషంలో అతనికి ఆమె, అజ్ఞాత బరామీటర్‌తో తన మనసుని కొలిచేస్తున్న డాక్టర్‌లా అనిపించింది. చూపు మరల్చుకుని సర్దుకుని కూర్చుని టైమ్ చూసుకున్నాడు.

ఆమె అతన్నే చూస్తూ అంది: "నలభై అయిదు శాతం చాలు. అది నేను చార్జ్ చేసే రేటే" అనేసింది.

ఇంతలో ఫోను మోగింది. ఎడం చెయ్యి జాపి సుతారంగా తీసింది.

"హలో!" అంది. అవతల నుంచి గొంతు వినగానే ఆమె ముఖం ఒక్కసారి వెలుగుపుంతలా అయింది. 'వన్ మినిట్' ఫోన్‌లో చెప్పి వెంటనే లేస్తూ, "సారీ! అర్జంట్ మెసేజ్. ఇప్పుడే వస్తాను." కార్డ్‌లెస్ ఫోన్ తీసుకుని దానిలోకి మాట్లాడుతూ వెళ్ళిపోయింది.

విశ్వనాథ ప్రతాప శర్మ ఆ ఫోన్ చేసిన అజ్ఞాత వ్యక్తికి లోలోపలే కృతజ్ఞతాంజలి ఘటించాడు.

అతను సోఫాలో వెనక్కు వాలి తల వెనక చేతులు ఆనించుకుని కూర్చున్నాడు. అతనికి చాలా ఆనందంగా ఉంది.

కళ్ళ ముందు మాళవికతో తను ఎన్నెన్నో ప్రోగ్రామ్స్ ఇప్పించిన దృశ్యాలు కనిపిస్తున్నాయి - లండన్, న్యూయార్క్ టూర్ కూడా వెళ్ళినట్టు.

లలిత టీ తెచ్చి ఇచ్చింది.

కప్పుని తన్మయత్వంతో చూశాడు. టీ సుగంధ భరితంగా, మర్చిపోలేనంత తీయటి జ్ఞాపకంగా ఉంది.

అతను సోఫాలో నుంచి లేచాడు. దూరంగా ఉన్న టేబిల్ దగ్గరకి వచ్చాడు. దాని పక్కనే పియానో ఉంది. దాన్ని చూడగానే అతని మనసు 'వాహ్!' అన్నట్టు మెచ్చుకుంది. పియానోకి ఎదురుగా వచ్చాడు. పియానో మీద ఫోటో ఉంది.

అది చూడగానే అతను అవాక్కు అయ్యాడు. పద్దెనిమిదేళ్ళ అమ్మాయి. రెండు జడలు, చెవులకి రింగులు, మెడలో గొలుసు. ముద్దబంతి పువ్వులా, తొలి యౌవనంతో విరిసి ఉన్న ముఖం. 'ఈ అమ్మాయి?..' అతని మనసు జ్ఞాపకాల వరండాలో వెనక్కు పరుగులు తీస్తోంది. 'ఈ అమ్మాయి! ఈ అమ్మాయి!'

అతని ముఖాన చిరు చెమటలు అలుముకుంటున్నాయి.

గుంటూరులో ఇంటర్ చదువుతున్నప్పుడు....కాలేజి నుంచి రూమ్‌కి సైకిలు మీద వస్తుంటే, దోవలో, సున్నం వేసి చాలా ఏళ్ళయి, వానకి నాచు పట్టిన పాత పడిన మేడ పై భాగంలో చువ్వల కిటికీ దగ్గర....రెండు జడలతో, చంద్ర బింబంలాంటి ముఖంతో అమ్మాయి. ఒక రోజు తన సైకిలు ఆ ఇంటి ముందు చెడిపోయింది. బాగు చేసుకుని లేస్తూ తలెత్తి చూశాడు. చువ్వల కిటికీ దగ్గర కూర్చుని అమ్మాయి కనిపించింది. తనూ చూశాడు. ఆ అమ్మాయి చూస్తోంది. తను అలాగే ఇంటికి వెళ్ళటం మర్చిపోయిన వాడిలా చూస్తుండటంతో ఆ అమ్మాయి కిటికీ రెక్క నగం వేసింది. తను స్పృహలోకి వచ్చి, సైకిలు తీసుకుని బయలుదేరాడు. దూరంగా వచ్చిన తర్వాత అప్రయత్నంగా తిరిగి చూశాడు. ఆ అమ్మాయి కిటికీ రెక్క తీసి చూస్తోంది. తనకి ఉత్సాహం వచ్చేసింది. సైకిలు పరుగు పందెంలా వేగంగా తొక్కేసాడు.

రోజూ అదే దోవ! అదే మజిలీ! ఆ అమ్మాయి ఎప్పుడూ అక్కడే కూర్చునేది. ఒక్కోసారి పుస్తకం చదువుతూ సర్వం మర్చినట్టు బొమ్మలా ఉండేది. తను సైకిల్ బెల్ మోగించేవాడు. పుస్తకంలో నుంచి ముఖం ఎత్తి చూసేది. ముఖంలో సిగ్గుతో కూడిన చిరునవ్వు దోబూచులాడేది.

తను అక్కడ నిలబడటానికి సాకుగా, అమ్మకానికి వచ్చిన బటానీలు, పల్లీలు, కూరలు ఏదో ఒకటి కొనేసేవాడు. ఆ అమ్మాయి అంటే తనకి చాలా ఇష్టం. నిద్రలో, తను సైకిలు మీద వెళ్తుంటే, ఆ అమ్మాయి కిటికీతో సహా తన వెంటే వస్తున్నట్టు కలలు వచ్చేవి.

ఆ ఇంటికి వెళ్ళాలని, ఆ అమ్మాయితో పరిచయం చేసుకోవాలని ఉండేది. కానీ, వాకిట్లో, వరండాలో ఒక పెద్దాయన మిలట్రీ మనిషిలా గుబురు మీసాలతో గుర్రున చూస్తుండేవాడు. ఆయనని చూస్తేనే దడగా ఉండేది.

ఆ రోజుల్లో అమ్మాయి మీద ఇష్టం అంటే, వెంటనే పెళ్ళి ఆలోచనే వచ్చేది. ఇప్పటిలా కలుసుకోవటాలు, తిరగటాలు, స్నేహాలు, కావాలి - వద్దు అని పెంచుకోవటాలు, తెంచుకోవటాలు లేవు. పెళ్ళి ఒక్కటే ప్రేమించిన అమ్మాయికి దగ్గరవటానికి మార్గం. తనకి ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలని గాఢంగా ఉంది. కానీ, వివరాలు తెలియవు. వాళ్ళ పక్కింటి పావని తనకి క్లాస్‌మేట్. రెండు జడల అమ్మాయి వివరాలు తెలుసుకోవటానికి పావనితో పరిచయం చేసుకున్నాడు. ఆ అమ్మాయి గురించి ఆరాలు తీయాలని తహతహ. అడగటానికి బిడియం. మెస్‌లో కట్టడానికి నాన్న పంపిన డబ్బులో సగం పైగా పావనికి టిఫిన్లు, ఐస్‌క్రీమ్‌లు, ఆవిడగారి అభిమాన రచయిత పుస్తకాలు కొనటానికే అయిపోయేవి.

పావని ద్వారా ఆ 'చంద్రవదనం' వివరాలు తెలిశాయి.

ఆ అమ్మాయి పేరు బుజ్జి. చిన్నప్పుడే పోలియో రావటంతో రెండు కాళ్ళూ చచ్చుపడిపోయినాయి. కుర్చీలో నుంచి లేవలేదు.

ఈ మాట వినగానే తన గుండె ఆగిపోయింది. 'ఆ అమ్మాయి కుంటిదా!' ఆమెను పెళ్ళి చేసుకోవాలని, ఆదర్శ దంపతులుగా ఆనందంగా జీవించాలని, గులాబి రేకుల్లాంటి మెత్తటి కలలు కంటున్నాడు. అతని నెత్తి మీద పిడుగు పడ్డట్టు అయింది.

'ఆ అమ్మాయి అంటే చాలా ఇష్టం. కానీ...కానీ... కుంటి భార్యతో కాపురం కష్టమే. తన మామయ్య భార్యకి ఒక కాలే కుంటి. ఆవిడతో ఆయన నరకం అనుభవిస్తున్నాడు.

కుంటి భార్య అయితే సరదాలు ఎలా తీరుతాయి. నలుగురిలోకి నా భార్య అంటూ సగర్వంగా తీసుకు వెళ్ళటం ఎలా! నేను స్వార్థపరుడిని! వెధవని! నా కసలు ప్రేమించే అర్హతే లేదు. నీచాతినీచుడిని! నన్ను ప్రేమించిన అమ్మాయిని, నేను చేసుకోలేక, వెన్ను చూపెట్టి పరుగెత్తుతున్నాను' — అని తిట్టుకున్నాడు. తర్వాత క్రమంగా ఇక ఆ వీధివైపే రావటం మానేశాడు. వేరే సందులో నుంచి వెళ్ళసాగాడు. అక్కడంతా మురుక్కాలవ, ఎగుడు దిగుడు రోడ్డు. అయినా సరే! అటే వెళ్ళటం మొదలు పెట్టాడు.

"విస్నూ, ఏమిట్రా! రాచమార్గంలాటి రోడ్డు వదిలి ఇట్లా తుప్పలు, దుబ్బల్లో, గోతుల్లో పడి వస్తున్నావు" అని ఒకసారి సైకిలు మీద వస్తున్న తనని రమణ నిలదీస్తే, "కర్మ!" అంటూ నుదుటన వేలు రాచి చూపించాడు.

అతనికి అర్థం కాకపోయినా "ఓహో! అదా!" అని అర్థం అయినట్టు తల ఊపాడు.

తర్వాత పావనితో పరిచయం పెరిగింది. ఉత్తరాలు రాసుకున్నారు. పెద్దలకి ఎదురు తిరిగి ప్రేమ వివాహం చేసుకున్నారు. అంతా పావనిదే ఫోర్స్. తనలో ధైర్యాన్ని బ్యాటరీని చార్జ్ చేసినట్టు చేసి చురుకుతనం, తెలివి, తెగింపు తెప్పించింది. పెద్దవాళ్ళు పెళ్ళి వద్దన్నారని, వారి మాట రానీయకుండా, నీడ పడకుండా నిషిద్ధం ప్రకటించి వారిని వెలివేసింది. జీవితంలో తనని బాగానే పరుగు తీయించింది. నలుగురు పిల్లలు. ఒక ఇల్లు. ఒక కారు. బ్యాంక్‌లో నాలుగు లక్షలు. జీవితం బాగానే ఉంది. పావని తనకి తెలియకుండానే తనని ఒక హీరో చేసేసింది.

"ఎక్స్క్యూజ్ మీ." వెనక నుంచి సుతారంగా వినిపించింది.

అతను వెనక్కు తిరిగాడు. అతని ముఖం నిండా ఆందోళన, ఆత్రత పోటీ పడ్తున్నాయి. పియానో మీద

**పియానో మీద ఫోటో ఉంది. అది చూడగానే అతను అవాక్కు అయ్యాడు. 'ఈ అమ్మాయి?' అతని మనసు జ్ఞాపకాల వరండాలో వెనక్కు పరుగులు తీస్తోంది.**



ఫోటో చూపిస్తూ, "ఈ అమ్మాయి...?" అన్నాడు.

"నేనే" అంది. "ఆఁ!" అయోమయంగా చూస్తున్నాడు.

మాళవిక ఆ ఫోటోని జీవితంలో అత్యంత ప్రాణప్రదమైన జ్ఞాపకంలా, సున్నితంగా చేతుల్లోకి తీసుకుంది.

"ఈ ఫోటో మీదా? కానీ, ఈ అమ్మాయి... నాకు తెలుసు" అన్నాడు.

"మీకా!" ఆ కళ్ళలో లీలగా ఆశ్చర్యం. ఆ మనిషి అసలు జీవితంలో ఎప్పుడూ గొప్పగా ఆశ్చర్యపోదేమో!

ఆమె ముఖ కవళికల్లో ఏదో నియంత్రణ... మామూలు జీవితం కన్నా ఇంకేదో ఉన్నతమైనది, కఠినమైనది చూసినట్టు. అతను గబగబా చెప్పేశాడు.

ఆ సమయంలో కనుబొమలెత్తుతూ, దించుతూ, చేయి తిప్పుతూ, కళ్ళు పెద్దవి చేస్తూ గబగబా గతం చెప్పేస్తున్న అతను స్టేజీ మీద ఒక విన్యాసం చూపిస్తున్న ప్రదర్శకుడిలా ఉన్నాడు. ఆమె నిశ్చలంగా బొమ్మలా నిలబడి అతని కళ్ళు, కనుబొమలు, పెదవులు, చేతుల కదలికలు కళ్ళతో గమనిస్తూ, అతను చెబుతున్న 'జ్ఞాపకం' వింటోంది.

"మీరా?" ఆశ్చర్యంగా అంది.

"మీరు... మీరు... ఈ అమ్మాయి అని...." ఫోటో చూపిస్తూ అన్నాడు. అతని కళ్ళ నిండా సంభ్రమం అశ్రువులుగా మారి బయటికి ఉరికి వచ్చేస్తోంది. జేబులో నుంచి రుమాలు తీసుకుని కళ్ళు తుడుచుకున్నాడు. ఇద్దరూ ఒక్క నిమిషం నిలబడిపోయారు.

మళ్ళా మౌన రాక్షసుడు అతని ముందుకు వచ్చి నిలబడ్డాడు.

ఆ రాక్షసుడిని పీక నులిమేస్తూ అతను ఆమెతో అన్నాడు - "మీరు......మీరు ఎప్పటి నుంచి నడుస్తున్నారు?" మాళవిక అర్థం కానట్టు చూసింది.

"మీకు పోలియో వచ్చి రెండు కాళ్ళూ...." ఆమె అందమైన పాదాలని చూస్తూ అన్నాడు.

"వాట్ నాన్సెన్స్! నాకా! పోలియోనా! ఎవరన్నారు?" అంది చిరాగ్గా.

"మీరు కిటికీ దగ్గర నుంచి కదిలేవారు కాదు.." నసిగాడు.

"అదా!" నవ్వేస్తూ అంది. అదా మీ అనుమానం. నేను కుంటిదాన్ని అనుకున్నారా ఏమిటి? మా అమ్మమ్మ క్యాన్సర్ పేషెంట్. ఆమెకి అరగంటకి అరగంటకి మందు ఇవ్వాలి. ఆ గదిలో నుంచి నేను నాలుగు నెలలు కదిలి కనీసం వీధి గుమ్మంలోకి అయినా రాలేదు అంటే మీరు నమ్ముతారా? డియర్ అమ్మమ్మ! ఆఖరి రోజులు నా ఒడిలో తృప్తిగా గడిపింది. క్యాన్సర్‌తో చచ్చిపోతున్నానని బాధే లేదు. 'ఎంత శాంతంగా ఉన్నావే బుజ్జీ' అనేది." ఆమె కళ్ళలో లీలగా చెమ్మ అలుముకుంది.

"మీరు చిన్నప్పటి నుంచీ బాగానే ఉన్నారన్నమాట" అయోమయంగా అన్నాడు.

"ఆహా! ఇంతబాగానూ ఉన్నాను." పాదాలు అలవోకగా ఎత్తి అడుగులు వేస్తూ అంధి.

ఇంతలో ఫోన్ మోగింది.

మాళవిక అందంగా నవ్వింది. "వాట్ ఎ మెమరీ! నైస్ టు మీట్ యూ" అంది నమస్కరిస్తూ. అతను ప్రతి నమస్కారం చేయటం మర్చిపోయాడు.

ఆమె వెళ్ళి ఫోన్ తీసింది. "వన్ మినిట్. ఇప్పుడే వస్తాను." ఫోన్ పెట్టి వచ్చింది.

"ఒ.కె" అంది. ఆమె చూపులు వీడ్కోలు ఇచ్చేసినాయి.

అతను తలూపాడు. ఆ ఇంటిని కళ్ళారా చూశాడు. చేతులు జోడించి నమస్కరిస్తున్న నెపంతో, ఆమెని మనసంతా కన్నులుగా చేసుకుని చూశాడు.

"బై!" అనేసింది. గుమ్మం వైపు భారంగా వచ్చాడు. ఆమె అతనితో గుమ్మం వరకూ వచ్చింది. గుమ్మం బయటికి వచ్చిన అతను వెనక్కు తిరిగి ఏదో చెప్పబోయాడు. అప్పటికే టక్కున తలుపులు మూసుకున్నాయి.

అతను మూసిన తలుపుల్ని చూస్తూ క్షణం సేపు అలాగే నిలబడిపోయాడు.

"ఎక్స్క్యూజ్‌మీ." ఇంకెవరో వచ్చి కాలింగ్ బెల్ కొడ్తున్నారు.

విశ్వనాథ ప్రతాప శర్మ శరీరాన్ని పాదాలు బలవంతంగా లిఫ్ట్ వైపు ఈడ్చుకుంటూ లాక్కెళ్ళినాయి. అతనికి లిఫ్ట్‌లో నుంచి దిగుతుంటే స్వర్గంలో నుంచి నరకంలోకి దిగివస్తున్నట్టు అనిపించింది.

అతను యంత్రంలా కారు దగ్గరికి వచ్చాడు. తలుపు తీసి ఎక్కాడు. శూన్య దృక్కులతో యంత్రంలాగా డ్రైవ్ చేస్తూ వస్తుంటే, ఆనాడు మురికి కాలువల వెంట, తుప్పలు, దిబ్బలు దాటి సైకిల్ మీద వస్తున్నట్టే ఉంది. కారు అతని ఇంటిముందుకు వచ్చి ఆగింది. కారు ఆపి వెంటనే దిగకుండా ఇంటిని చూశాడు. సెకెండ్ హాండ్ ఇల్లు. చవకగా వస్తుంటే పెద్దది అని కొనుక్కున్నాడు. సైట్ వాల్యూ తప్ప ఇతర ఏ విలువా లేని ఇల్లు. ఇదివరకు డబ్బు ముఖ్యం గాని, అందం అన్నం పెట్టదు అనేవాడు. అందమైన పరిసరాలు మనిషిని ఎంత సాంత్వనపరుస్తాయో అనుభవం అయింది ఇప్పుడే. పిల్లల అరుపులతో ఇల్లు గోలగా ఉంది.

వచ్చి కాలింగ్ బెల్ కొట్టాడు.

చిన్నవాడు వచ్చి తలుపు తీశాడు.

"డాడీ! నా బ్యాట్ తెచ్చావా?" వెంటనే నిలదీశాడు.

"డాడీ! మా స్కూలు యానివర్సరీ చందాకావాలి." పెద్ద కూతురు వచ్చింది.

"డాడీ! నేను ఫ్రెండ్స్‌తో ఎక్స్‌కర్షన్‌కి వెళ్తున్నాను. ఫైవ్ హండ్రెడ్ కావాలి." పెద్ద కొడుకు బిగ్గరగా చెప్పేశాడు.

"ఏమిటీ ఇంత లేటు? ఎక్కడ విడిదిచేసి వచ్చారు?" పావని సాగదీస్తూ వ్యంగ్యంగా అంది.

ఆమె నుదిటి మీద గొర్రెకొమ్ములులా, కట్ చేసిన జుట్టు చిందరగా పడి ఉంది. నలుగురు పిల్లల తల్లిని, మా ఆయన నేను గీసిన గీటు దాటడు. ఇంక నాకెందుకు అందం అనే ధీమాతో నిర్లక్ష్యం చేసిన శరీరం. ఆ సమయంలో ఆమె కోరలు, గోళ్ళు గల రాక్షసిలా అనిపించింది.

"ఏమిటా నిలువు గుడ్లు? రండి. భోజనం వడ్డిస్తున్నా." అరిచింది.

అతను ఉలికిపాటుగా వెంటనే బట్టలు మార్చుకు రావడానికి బెడ్‌రూమ్ వైపు తిరిగాడు.

ఇంతలో కర్రల టక్ టక్ చప్పుడు వినిపించింది.

విశ్వనాథ ప్రతాప శర్మ తిరిగి చూశాడు. ఆఖరి కూతురు దివ్య. చంకల కింద కర్రల ఊతంతో నడిచి వస్తోంది. ఆమె రెండు కాళ్ళూ పోలియోతో చచ్చుబడి పీలగా ఉన్నాయి.

విశ్వనాథ ప్రతాప శర్మ ఎదురు వెళ్ళి ఆ అమ్మాయి తల మీద ఆప్యాయంగా చెయ్యి వేశాడు. అతనికి ఈ రోజు గుండెల మీద నుంచి కొండంత పశ్చాత్తాప భారం దిగిపోయి హాయిగా ఉంది.

అతని కళ్ళ వెంట నీళ్ళు కారుతున్నాయి. 'దివ్యా! ఇన్నాళ్ళూ నువ్వు నా పాపానికి ప్రాయశ్చిత్తం అని కుమిలిపోయానమ్మా! బుజ్జిని చేసుకోకుండా మానినందుకు భగవంతుడు నన్ను ఇలా శిక్షించాడని అనుకున్నాను. కానీ... కాదు. మీ అమ్మ అబద్ధం చెప్పి నన్ను మోసం చేసి పెళ్ళి చేసుకుంది. ఈ శిక్ష మీ అమ్మది! భగవంతుడు ఆ కన్నతల్లి మనసుని బాగా శిక్షించాడు. ఇక ఆమెని నేనేమీ అనాల్సిన అవసరం లేదు!' ■